క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సబ్ యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, గణేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి



మాక్లూర్: పండులను శాంతియుతంగా జరుపుకోవాలని నార్త్ జోన్ సీఐ సతీష్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది ఉండదని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో నెలకొల్పుతున్న ప్రతి విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు పోలీస్ స్టేషన్లో వివరాలు ఇవ్వాలన్నారు. వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభకు తరలిరావాలి



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చి, విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్ అన్నారు. ఆర్మూర్‌లో శనివారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.నాయకులు సాయిబాబాగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'మట్టి సేకరణ'



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కాశీ హనుమాన్ గల్లీలో బీజేపీ నాయకులు 'మేరా మిట్టి, మేరా దేశ్' కార్యాక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి మట్టిని సేకరించారు. ఢిల్లీలో నిర్మిస్తున్న స్మృతివనానికి మట్టిని సేకరించి పంపుతున్నామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి. జిల్లా నాయకులు జెస్సు అనిల్, అమ్దాపూర్ రాజేష్, ద్యాగ ఉదయ్, పాలేపు రాజు, ఆకుల రాజు, శ్రీనివాస్, కార్యకర్తలు ఉన్నారు.

బొజ్జా తారకం వర్ధంతి సభ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శనివారం దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో దళిత బహుజన ఉద్యమ శిఖర మానవహక్కుల మార్గదర్శి బొజ్జా తారకం ఏడవ వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బొజ్జ తారకం అడుగుజాడల్లో నడుస్తూ దళిత జాతి అభివృద్ధికై పోరాటం చేస్తామన్నారు. నాయకులు కొక్కెర భూమన్న, మూగ ప్రభాకర్, అంగరి ప్రదీప్, నారాయణ, పింజా పెద్ద భోజన్న పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ



ఎడపల్లి: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బీజేపీ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం తెలంగాణ విమోచన దినాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీధర్, మల్లెపూల శ్రీనివాస్, ఇంద్రకరణ్, లచ్చరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వర్ని: మండలంలోని కోకల్‌దాస్ తండాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు మూడు రాజేందర్ కాంగ్రెస్‌లోలో చేరారు. వర్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన 15 మంది కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు శంషుద్దీన్, శనిగరం కిషన్, నరేడ్ల సాయిలు, శివ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో చిన్నారులు

- చిట్టిచేతులతో మట్టి గణపతుల తయారీ
- పలువురికి వినాయక ప్రతిమల అందజేత



మాక్లూర్‌లో విద్యార్థులకు మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్: పర్యావరణ పరిరక్షణలో పాఠశాలల విద్యార్థులు తమవంతు బాధ్యత పోషిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శనివారం విద్యార్థులు స్వయంగా మట్టితో గణపతులను తయారు చేశారు. మైల్స్ పాఠశాల, కాంతి హైస్కూల్, జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్, ఐఐటీ ప్రజ్ఞ స్కూల్ విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి, పాఠశాలలో ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలల యాజమాన్యం బహుమతులను అందజేశారు. అలాగే సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. ప్రజలలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినిలు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను ఆర్మూర్‌మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కౌన్సిలర్ వరలక్ష్మిలకు అందజేశారు. మట్టి గణపతులను వాడాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

పోతంగల్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టితో గణపతులు తయారు చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు యూత్ ఆధ్వర్యంలో బహుమతులు అందచేశారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు విద్యార్థులకు మట్టి గణపతిలను అందజేశారు. హెచ్ఎం రాజేందర్, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో జె.క్రాంతి, సర్పంచ్ లింగం, బీఆర్ఎస్ నాయకులు మనోహర్ రావు విద్యార్థులు పాల్గొన్నారు.







ఆర్మూర్‌లో మట్టి గణపతులతో విద్యార్థులు.. పండిత్ వినీతకు గణపతి ప్రతిమను అందజేస్తున్న విద్యార్థినులు.. మట్టిగణపతులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్, జాన్కంపేట్ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు మిట్టపల్లి మహిపాల్, ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, సొడ రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యంరెడ్డి, సొడ చందన్, శేఖర్, శోభన్‌గౌడ్ పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.



జాన్కంపేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

మళ్లీ కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి, రైతు నాయకుడు కోటపాటి నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ మండల సమావేశం



రెంజల్(బోధన్): మండలకేంద్రంలో శనివారం ఎంపీపీ లోలపు రజనీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యుల సూచన మేరకు పలు తీర్మానాలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని 17 గ్రామాలకు కేవలం నలుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. పలువురు ఎంపీటీసీలు కూడా సమావేశానికి డుమ్మా కొట్టారు.

ఈజీఎస్ పనుల్లో అవకతవకలు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో అవకతకలు జరిగినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. నందిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాలలో సీఆర్పీలు చేపట్టిన సామాజిక తనిఖీలో జరిగిన అవకతకలను వివరించారు. మండలంలో జరిగిన గ్రావెల్ రోడ్లు, లింక్‌రోడ్లు, కాలువలు, బృహత్‌పల్లెపథకం, హరితహారం పనులల్లో మస్టర్లలో కొట్టివేతలు, వంద రోజులు పూర్తయిన కూలీలకు చెల్లింపులు జరగకపోవడం డీఆర్‌పీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఏపీవో సంతకం లేకుండా పనులకు చెల్లింపులు జరిగాయని తెలిపారు. డీఆర్‌డీఏ చందర్ నాయక్, జిల్లా విజిలెన్సు అధికారి నాగవర్ధన్, ఎంపీడీవో నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో మాట్లాడుతున్న చందర్‌నాయక్

బీఆర్ఎస్‌లో చేరికలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన యువకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాజేశ్వర్ రెడ్డి సమక్షంలో యువకులు పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో పలువురు..

ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు వినయ్ రెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన యువకులు పార్టీలో చేరారు.

హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేయాలి

ఆర్మూర్‌టౌన్: గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా హెల్త్‌క్యాంపు నిర్వహించాలని ప్రగతిశీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డు పట్టణ పీహెచ్‌సీలో శనివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పరిశుభ్రత సరిగ్గా లేకపోవడంతో గ్రామాలలో డెంగీ, టైఫాయిడ్, మలేరియ లాంటి వ్యాధులు ప్రభులుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. నాయకులు కిషన్, నరేంధర్, సత్తెక్క, దుర్గాప్రసాద్, పద్మ ,సత్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముమ్మాటికీ విద్రోహ దినమే



బోధన్: సెప్టెంబర్ 17 తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ విద్రోహ దినం పాటించాలని ప్రజలను కోరుతున్నామని తెలిపారు. నాయకులు షేక్ నజీర్, సురేష్, వినోద్,శ్రీనివాస్, నారాయణ గౌడ్, పేట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

టీడీపీ నాయకుల నిరసన



నందిపేట్(ఆర్మూర్): ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం అరెస్టును నిరసిస్తూ నందిపేటలో శనివారం టీడీపీ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దేగాం యాదగౌడ్, వినోద్‌కుమార్, నాగేశ్వరరావు, జ్యోతినారాయణ, దంతాల ఆనంద్, జావిద్, సుబ్బారావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట ఆదర్శ పాఠశాలలో శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు అభిలాష్ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం పథకం ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. నాయకులు అల్లరి ప్రశాంత్, సాగర్, నవీన్, గంగాధర్ పాల్గొన్నారు.

చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలి

నందిపేట్: మండలంలోని అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇన్‌స్పైర్, ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్ సుధాకర్, ప్రిన్సిపాల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఈసీలో ప్రాంగణ నియామకాలు

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద గల విజయ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. వీఆర్‌ఈసీలోని 60 మంది బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, ప్లేస్మెంట్ అధికారి శ్రీకాంత్ ఉన్నారు.

గ్రంథాలయం ఏర్పాటుకు భవనం పరిశీలన

వర్ని: చందూరులో నూతన గ్రంథాలయం ఏర్పాటుకు జిల్లా గ్రంథాలయం సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం భవనాన్ని పరిశీలించారు. జిల్లా గ్రంథాలయం అసిస్టెంట్ లైబ్రరీ తారకం, చందూర్ సర్పంచ్ సాయిరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల అందజేత


బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాల చెక్కులను శనివారం ఛైర్మన్ గంగాధర్ అందజేశారు. సీఈవో గంగాధర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కులు..



బాల్కొండ: మెండోరా మండలంలోని పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. కోఆప్షన్ సభ్యుడు బాబా, పోచంపాడ్ సర్పంచ్ మిస్బా, ఆర్ఐ సాయాగౌడ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..



వేల్పూర్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం వేల్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ అల్లకొండ భారతి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో కమలాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు తీగెల రాధామోహన్, ఏనుగు గంగారెడ్డి, సొడ రమేశ్, పురుషోత్తంరెడ్డి,సుధాకర్‌గౌడ్, పిట్లసత్యం, సొడ చందన్, చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వన్నెల్ కే గ్రామానికి చెందిన బైనాకుల ప్రశాంత్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ చేపట్టి ఫోన్‌ను సేకరించారు. శనివారం ఎంపీపీ వాకిడీ సంతోష్‌రెడ్డి చేతుల మీదుగా బాధితుడికి ఫోన్‌ను అందజేశారు.

కొనసాగిన కార్మికుల దీక్షలు

బోధన్: పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు శనివారం 43వ రోజుకు చేరాయి. దీక్షలో కార్మిక నాయకులు నాగేశ్వర్‌రావు, లింగంగౌడ్‌లు కూర్చున్నారు. బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సింగిల్ విండో మహాజన సభ

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్‌లో శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. పలు అంశాలపై సభ్యులంతా చర్చించారు. అనంతరం సీఈఓ రాజేశ్వర్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించగా, సభ్యులు ఆమోదించారు. వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి క్రీడాపోటీలు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రాజేశ్వర్, క్రీడల కన్వీనర్ సాయన్న తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి





ఆర్మూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించిన అంగన్‌వాడీ టీచర్లు.. బోధన్‌లో..

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/వర్ని/కమ్మర్‌పల్లి: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వారు చేపట్టిన సమ్మె శనివారం ఆరోరోజుకొనసాగింది. ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో అంగన్‌వాడీలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను ముట్టడించారు. బోధన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రతినిధి యేశాల గంగాధర్‌ను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా అంగన్‌వాడీ ఉద్యోగులు వాహనానికి అడ్డుపడ్డారు. ఈక్రమంలో పోలీసులతో వాగ్వాదం చోటు చేసుకుంది. యూనియన్ నాయకుల జోక్యం చేసుకుని అంగన్‌వాడీ ఉద్యోగులను సముదాయించారు. శంకర్‌గౌడ్‌ను స్టేషన్ తీసుకెళ్లి వదిలిపెట్టారు. దీంతో అంగన్‌వాడీలు సమ్మె శిబిరానికి చేరుకుని బైఠాయించారు. రుద్రూర్‌లో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. మోస్రాలో కాంగ్రెస్ నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. కమ్మర్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంగన్‌వాడీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.





మోస్రాలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు.. కమ్మర్‌పల్లిలో బీజేపీ నేతల సంఘీభావం

ఆధ్యాత్మికం..

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



నవీపేట: మండలంలోని ధర్మారం(ఏ) గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం కోతి దేవుని ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 47 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన వైశ్యునికి కోతి దేవుడు కలలో వచ్చి మందిరాన్ని నిర్మించాలని చెప్పడంతో ఆయన మందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి యేటా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కోతి దేవుని మందిరం ఉండడంతో ఈ గ్రామానికి కోతి ధర్మారంగా పిలుస్తారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు ఆలయంలో పూజలు చేశారు.





ఆధ్యాత్మిక జీవనంతోనే ప్రశాంతత

బోధన్: ఆధ్యాత్మిక జీవనంతోనే ప్రశాంతత చేకూరుతుందని, నిత్యం శివలింగార్చన చేయడం మరువొద్దుని మహారాష్ట్ర ప్రాంతం నాందేడ్ జిల్లాలోని తమ్లూర్ మఠాధిపతి శివానంద శివాచార్యులు భక్తులకు బోధన చేశారు. పట్టణంలోని జంగంగల్లీలోగల పురాణే మఠంలో శనివారం వీరశైవ సమాజ్ అధ్వర్యంలో సామూహిక శివలింగ దీక్ష కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మఠాధిపతి చేతుల మీదుగా వీరశైవులు, మహిళలు శివలింగ దీక్షను స్వీకరించారు. ముందుగా మహారాజ్‌కు పాద పూజ, భజనలు, అన్నదానం చేశారు. భక్తులను మఠాధిపతి సన్మానించారు. ఏకచక్రేశ్వరాలయం చైర్మన్ బీర్కూర్ బుజ్జి, జంగమ సమాజ్ ప్రతినిధులు అజయ్‌కుమార్, బాబయ్యప్ప, నర్సింగ్ అప్ప, శంకరప్పా, రాచప్ప పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

బోధన్‌టౌన్(బోధన్): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిగారి భూమయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వారు నిరసన దీక్షలను ప్రారంభించారు. భూమయ్య మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపాలన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాయకులు రమేష్, బండారి పోశెట్టి, అబ్బయ్య, రవి, కిన్నెర మోహన్, వినోద్, గంగాధర్, సాయిలు ఉన్నారు.



బోధన్‌లో రిలే దీక్షల్లో కూర్చున్న నాయకులు

వేల్పూర్ మండలంలో..

వేల్పూర్: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోతె భూమన్న డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, లేనిచో భారీ ఎత్తున ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. నాయకులు దేవన్న, రాజేశ్వర్,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

విద్యుత్ సరఫరాకు అనుమతి తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: వినాయక చవితి నేపథ్యంలో ఈనెల 18 నుంచి నిర్వహించే వినాయక మండపాలకు నిర్వహకులు విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ డీఈ హరిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కిలో వాట్‌కి రూ. 1,560, రెండు కిలోవాట్ రూ. 2,300, 1.5 కిలోవాట్‌కి రూ. 3,200 డీడీ చెల్లించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: మండలంలోని అందాపూర్ కేజీబీవీ కళాశాలలో వంట మనిషి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల స్పెషల్ ఆఫీసర్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన, ఆసక్తి గలవారు కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈ నెల 22వరకు గడువు ఉందని, వివరాలకు 8501077646కు సంప్రదించాలన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – చాంగురే బంగారు రాజా (తెలుగు) - 10.10, 7.10 రామన్న యూత్ 1.00 ఖుషి 3.45, బిచ్చగాడు 10.00
స్క్రీన్-2 – మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 – మార్క్ ఆంటోని : 10.10, 1.20, 7.05, 10.15
స్క్రీన్-4 – జవాన్ (తెలుగు)- 11.00, 2.35, జవాన్ (హిందీ)- 6.10, 9.45